సాక్షి
సంగారెడ్డి

సోమవారం ‌। 18 ‌। సెప్టెంబర్ ‌। 2023



అభివృద్ధిలో ఆదర్శం

స్వీయ అస్తిత్వం కోసం 60 ఏళ్లు ఉద్యమించిన తెలంగాణ రాష్ట్రం ఇప్పుడు అభివృద్ధిలో దూసుకుపోతోందని రాష్ట్ర హోంశాఖ మంత్రి మహమ్మద్ మహమూద్ అలీ పేర్కొన్నారు. వివరాలు 08లో ▸



వికేంద్రీకరణతో సుపరిపాలన

చిన్న మండలాలు, గ్రామ పంచాయతీల ఏర్పాటు ద్వారా పరిపాలన వికేంద్రీకరణ జరగడంతోపాటు అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు.
వివరాలు 08లో ▸



ఘనంగా సమైక్యతా దినోత్సవం

జాతీయ సమైక్యతా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు జాతీయజెండాలను ఆవిష్కరించి సాయుధ పోరాట వీరుల త్యాగాలను కొనియాడారు.
వివరాలు 09లో ▸

న్యూస్‌రీల్

రేపు మంత్రి హరీశ్‌రావు రాక

సంగారెడ్డి టౌన్: రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్యశాఖల మంత్రి హరీశ్ రావు మంగళవారం నారాయణఖేడ్ నియోజకవర్గంలో వివిధ కార్యక్రమాల్లో పాల్గొనున్నందున ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ శరత్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆదివారం మంత్రి పర్యటన ఏర్పాట్లపై అధికారులతో టెలీకాన్ఫరెన్స్‌లో దిశానిర్దేశం చేశారు. టెలీకాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, డీఆర్డీఓ శ్రీనివాసరావు, జెడ్పీ సీఈఓ ఎల్లయ్య, డీపీఓ సురేష్ మోహన్, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి దేవుజా, మున్సిపల్ కమిషనర్, నారాయణ ఖేడ్ రెవెన్యూ డివిజనల్ అధికారి, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, తదితరులు పాల్గొన్నారు.

వినాయక చవితి శుభాకాంక్షలు


కలెక్టర్ శరత్

సంగారెడ్డి టౌన్: వినాయక చవితి పండుగ సందర్భంగా కలెక్టర్ డాక్టర్ శరత్ ప్రజలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి గణపతులను ప్రతిష్ఠించి భక్తి శ్రద్ధలతో పండుగ జరుపుకోవాలని కోరారు. విఘ్నేశ్వరుడి కృపతో విఘ్నాలు తొలగి అందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో జీవనం సాగించాలని కలెక్టర్ ఆకాంక్షించారు. పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలన్నారు.

సమగ్ర శిక్షా ఉద్యోగులకు విద్యాశాఖలో విలీనం చేయాలి


ఆందోళన చేస్తున్న సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు

సంగారెడ్డి టౌన్: సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు శేషాద్రి అన్నారు. జేఏసీ కలెక్టరేట్ వద్ద కొనసాగుతున్న నిరవధిక సమ్మె ఆదివారం నాటికి 14వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్ట్ విధానంలో పనిచేస్తున్న చేస్తున్న ఉద్యోగులను రెగ్యులర్ చేసి విద్యాశాఖలో విలీనం చేయాలన్నారు. ప్రతీ ఉద్యోగికి జీవిత బీమా, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు దత్తు, నరేశ్, రాజు ధనలక్ష్మి, శిరీష పాల్గొన్నారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి


విశ్వకర్మ జయంతిలో పాల్గొన్న అధికారులు

సంగారెడ్డి టౌన్: విరాట్ విశ్వకర్మ జయంతిని కలెక్టరేట్‌లో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధికారి జగదీశ్ మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణుల ఆర్థిక స్థితిగతులను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం వారి సంక్షేమానికి రూ.లక్ష ఆర్థిక సహాయం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, విశ్వకర్మ జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరికి తీవ్ర గాయాలు

నారాయణఖేడ్: ద్విచక్రవాహనం అదుపుతప్పి ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. నాగల్‌గిద్ద మండలం గోందేగాంకు చెందిన మాజీ సర్పంచ్ శంకరప్పతోపాటు శాంతయ్యస్వామి ఆదివారం నారాయణఖేడ్‌కు బైక్‌పై వస్తుండగా అదుపుతప్పి కిందపడ్డారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ఖేడ్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. ఆస్పత్రికి వెళ్లి క్షతగాత్రులను కాంగ్రెస్ నాయకులు పరామర్శించారు.

అభివృద్ధిలో ఆదర్శం

- అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు
- 78 వేల మంది రైతుల రూ.460 కోట్ల పంటరుణాలు మాఫీ
- ఆసరా పింఛన్లతో 1.61 లక్షల మందికి లబ్ధి
- హరితహారంలో జిలా మొదటి స్థానం
- హోంశాఖ మంత్రి మహమూద్ అలీ
- కలెక్టరేట్‌లో తెలంగాణ జాతీయ సమైక్యతా దినోత్సవ వేడుకలు

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: స్వీయ అస్తిత్వం కోసం 60 ఏళ్లు ఉద్యమించిన తెలంగాణ రాష్ట్రం ఇప్పుడు అభివృద్ధిలో దూసుకుపోతోందని రాష్ట్ర హోంశాఖ మంత్రి మహమ్మద్ మహమూద్ అలీ పేర్కొన్నారు. ఆదివారం కలెక్టరేట్ కార్యాలయం ఆవరణలో తెలంగాణ జాతీయ సమైక్యతా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎంతో మంది తెలంగాణ బిడ్డల త్యాగాల ఫలితంగానే నేటి తెలంగాణ అభివృద్ధికి నాంది పలికిందన్నారు. సెప్టెంబర్ 17 తెలంగాణ చరిత్రలో ఎంతో కీలకమైన రోజని, సువిశాల భారత దేశంలో తెలంగాణ అంతర్భాగమైన రోజు అని పేర్కొన్నారు. నాటి, నేటి తరాల ఉద్యమస్ఫూర్తితో మరింత అభివృద్ధి దిశగా అడుగులు వేద్దామని, పోరాడి సాధించుకున్న తెలంగాణలో ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందిస్తోందని, జిల్లా ప్రగతిని వివరించారు.

రైతుబంధుతో రూ.3,557 కోట్లు

''రైతుబంధు పథకం కింద జిల్లాలో 11 విడతల్లో రూ.3,557 కోట్లను 3.25 లక్షల మంది రైతుల ఖాతాల్లో జమ చేశాం. రైతుబీమా పథకం కింద మరణించిన 6,698 మంది రైతుల కుటుంబాలకు రూ.335 కోట్లు ఆర్థిక సాయం అందించాం. రుణ మాఫీ కింద 78 వేల మంది రైతులకు రూ.460 కోట్ల పంట రుణాలను మాఫీ చేశాం. రూ.4,427 కోట్లతో చేపట్టిన సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తిపోతల పథకాల నిర్మాణం పూర్తయితే జిల్లాలో 3.84 లక్షల ఎకరాలు సాగులోకి వస్తాయి. గొర్రెల పంపిణీ పథకంలో భాగంగా తొలివిడతలో 19,203 మందికి, రెండో విడతలో 1,242 మంది లబ్ధిదారులకు గొర్రెలను పంపిణీ చేశాం. మిషన్ భగీరథ ద్వారా 943 నివాసిత ప్రాంతాలకు ఇంటింటికి తాగునీటిని సరఫరా చేస్తున్నాం. దళితబంధు పథకం ద్వారా తొలివిడతలో 444 మందికి రూ.10 లక్షల చొప్పున యూనిట్లు మంజూరు చేశాం. రెండో విడతలో ఒక్కో నియోజకవర్గానికి 1,100 మందికి యూనిట్లను అందించనున్నాము. జిల్లాలో 173 పల్లె దవాఖానాలు, 19 బస్తీ దవాఖానాలను ఏర్పాటు చేశాం. పటాన్‌చెరువులో 200 పడకల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, రూ.34 కోట్లతో సంగారెడ్డిలో ప్రభుత్వ నర్సింగ్ కాలేజీల నిర్మాణం జరుగుతోంది. జిల్లాలో ఇప్పటివరకు 3,912 మంది గర్భిణులకు న్యూట్రీషియన్ కిట్‌లు, ఆరోగ్య మహిళా క్లినిక్‌ల ద్వారా 11,063 మంది మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి 8,023 మందికి చికిత్స అందిస్తున్నాం.'' అని మహమూద్ అలీ పేర్కొన్నారు.

బ్యాంకు లింకేజీ జిల్లా మొదటి స్థానం

''ఆసరా పథకం కింద అర్హులైన 1.61 లక్షల మంది లబ్ధిదారులకు ప్రతీనెల రూ.36.30 కోట్లు పంపిణీ చేస్తున్నాం. బ్యాంకు లింకేజీ పథకం కింద 5,291 స్వయం సహాయక సంఘాలకు రూ.419 కోట్ల రుణాలిచ్చి రాష్ట్రస్థాయిలో జిల్లా మొదటి స్థానంలో నిలిచింది. మున్సిపాలిటీల్లోని సంఘాలకు రూ.34.32 కోట్లు ఇచ్చాము. తెలంగాణకు హరితహారం కార్యక్రమంలో 57 లక్షల మొక్కలు నాటి రాష్ట్ర స్థాయిలో జిల్లా మొదటి స్థానంలో నిలిచింది. జిల్లాలో 1,127 మంది లబ్ధిదారులకు 1,808 ఎకరాల అటవీభూమిని పోడు పట్టాలు పంపిణీ చేశాం. మైనార్టీబంధు కార్యక్రమంలో భాగంగా తొలి విడతలో 448 మంది లబ్ధిదారులకు రూ.లక్ష ఆర్థిక సాయం అందించనున్నాం. రెండో విడతలో మరో 600 మంది లబ్ధి చేకూరనుంది. బీసీ, ఎంబీసీ కులవృత్తుల వారికి రూ.లక్ష చొప్పున 1,500 మంది లబ్ధి చేకూర్చాము. రూ.213 కోట్లతో నిర్మించిన 3,450 డబుల్‌బెడ్‌రూం గృహాలను లబ్ధిదారులకు పంపిణీ చేశాం. జిల్లాలో 5,865 మంది లబ్ధిదారులకు గృహలక్ష్మి పథకం మంజూరు చేశాం. టీఎస్ ఐపాస్ ద్వారా ఈఏడాది 186 పరిశ్రమలకు అనుమతులిచ్చాం. సుమారు రూ.1,881 కోట్ల పెట్టుబడితో 176 పరిశ్రమల స్థాపన జరిగింది. కల్యాణలక్ష్మి పథకం ద్వారా 40,716 మంది, షాదీముబారక్ పథకం కింద 11,243 మందికి లబ్ధిచేకూరింది.'' అని హోంమంత్రి పేర్కొన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో అహర్నిశలు శ్రమిస్తున్న పోలీసు యంత్రాంగాన్ని మంత్రి అభినందించారు. వేడుకల్లో రాష్ట్ర చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్ చింతా ప్రభాకర్, డీసీఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్, కలెక్టర్ డాక్టర్ శరత్, ఎస్పీ రమణకుమార్, జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.


సభలో ప్రసంగిస్తున్న మంత్రి మహమూద్ అలీ


జాతీయ జెండాకు వందనం చేస్తున్న మంత్రి మహమూద్ అలీ

పరిపాలన వికేంద్రీకరణతో సుపరిపాలన

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: చిన్న మండలాలు, గ్రామ పంచాయతీల ఏర్పాటు ద్వారా పరిపాలన వికేంద్రీకరణ జరగడంతోపాటు శరవేగంగా అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. అమీన్‌పూర్ మండల పరిధిలోని దయారా గ్రామంలో రూ.85 లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని ఆదివారం స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అభివృద్ధే లక్ష్యంగా, సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, ఎంపీపీ దేవానందం, సర్పంచ్ భాస్కర్ గౌడ్, వైస్ ఎంపీపీ సునీత సత్యనారాయణ పాల్గొన్నారు.

గోనెమ్మ యూత్ అసోసియేషన్ భవనం ప్రారంభం

పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని గోనెమ్మ బస్తీలో రూ.30 లక్షల సొంత నిధులతో నిర్మించిన గోనెమ్మ యూత్ అసోసియేషన్ భవనాన్ని ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్, మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు రాజు తదితరులు పాల్గొన్నారు.

మట్టి వినాయక ప్రతిమల పంపిణీ

పటాన్‌చెరు/పటాన్‌చెరు టౌన్: జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో పట్టణంలోని గాంధీ పార్క్ వద్ద ఉచితంగా మట్టి వినాయక ప్రతిమలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్ సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

విభిన్న సంస్కృతులకు నిలయం పటాన్‌చెరు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): విభిన్న సంస్కృతులకు నిలయం పటాన్‌చెరు నియోజకవర్గమని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. ఆదివారం రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని లక్ష్మీ గార్డెన్స్‌లో కేరళ సౌహృదయ కళా వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన ఓనం వేడుకలకు హాజరయ్యారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ పుష్ప నగేష్, సీనియర్ నాయకులు ఆదర్శ్ రెడ్డి, పృథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.


గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

విమోచన దినోత్సవం అధికారికంగా నిర్వహించాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు నరేందర్ రెడ్డి

సంగారెడ్డి మున్సిపాలిటీ: సంగారెడ్డిలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు నరేందర్ రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ విమోచన దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి రాకముందు తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేసిన కేసీఆర్ అధికారంలోకి వచ్చాక ఎంఐఎం పార్టీకి భయపడి నిర్వహించడం లేదన్నారు.

ఇద్దరికి తీవ్ర గాయాలు

నారాయణఖేడ్: ద్విచక్రవాహనం అదుపుతప్పి ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. నాగల్‌గిద్ద మండలం గోందేగాంకు చెందిన మాజీ సర్పంచ్ శంకరప్పతోపాటు శాంతయ్యస్వామి ఆదివా రం నారాయణఖేడ్‌కు బైక్‌పై వస్తుండగా అదుపుతప్పి కిందపడ్డారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ఖేడ్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. వారిని కాంగ్రెస్ నాయకులు పరామర్శించారు.

పురిటి నొప్పులతో గర్భిణి అష్టకష్టాలు

కల్హేర్(నారాయణఖేడ్): పురిటి నొప్పులు రావడంతో ఓ గర్భిణి ఆస్పత్రికి వెళ్లేందుకు అష్టకష్టాలు పడాల్సి వచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి. కల్హేర్ మండలం బీబీపేటకు చెందిన గర్భిణి శ్రావణికి పురిటి నొప్పులు వచ్చాయి. ఆమె కుటుంబ సభ్యులు శనివారం రాత్రి 108లో సిర్గాపూర్ పీహెచ్‌సీకి తరలించారు. అక్కడ నార్మల్ డెలివరీ చేసే అవకాశం లేదని, నారాయణఖేడ్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లాలని సిబ్బంది సూచించారు. 108కు మరోసారి కాల్ చేశారు. ఎన్నిసార్లు చేసినా స్పందించలేదు. దీంతో అర్ధరాత్రి శ్రావణికి నొప్పులు ఎక్కువయ్యాయి. చేసేదేమీ లేక సిర్గాపూర్ పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ మహిపాల్‌రెడ్డి స్పందించి గర్భిణిని పోలీసు వాహనంలో నారాయణఖేడ్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ నార్మల్ డెలివరీ కావడంతో తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నారు. పోలీసులు సహకారానికి శ్రావణి కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

గొప్ప సంఘ సంస్కర్త బసవేశ్వరుడు

- బీదర్ ఎమ్మెల్యే శైలేంద్ర

జహీరాబాద్ టౌన్: కుల, మత భేదాలు లేని సమాజ స్థాపనకు కృషి చేసిన గొప్ప సంఘ సంస్కర్త విశ్వ గురువు బసవేశ్వరుడని కర్నాటక రాష్ట్రంలోని బీదర్ ఎమ్మెల్యే శైలేంద్ర బెళదాళే అన్నారు. జహీరాబాద్ లింగాయత్ సమాజ్, అనుభవ మండపం కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన శరణ తత్వ ప్రవచన మహోత్సవాల ముగింపు కార్యక్రమం శనివారం రాత్రి బసవ ఫంక్షన్‌హాల్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాత్మా బసవేశ్వరుడి ప్రవచనాలు అందరికీ ఆదర్శనీయమన్నారు. డీసీఎంఎస్ ఉమ్మడి మెదక్ జిల్లా చైర్మన్ ఎం.శివకుమార్ మాట్లాడుతూ బసవేశ్వరుడి బోధనలను ఆచరిస్తూ సమసమాజ నిర్మాణం కోసం అందరం కృషి చేయాలన్నారు. సామాజిక ఉద్యమకారుడు ఢిల్లీ వసంత్ మాట్లాడుతూ సామాజిక సమభావన, అంటరానితనం, లింగ, కుల వివక్షతలను రూపుమాపడంలో బసవేశ్వరుడు కృషి చేశారని కొనియాడారు. నెలపాటు ప్రవచనాలు చెప్పిన లింగమూర్తి స్వామీజీ సన్మానించారు. కార్యక్రమంలో లింగాయత్ సమాజ్ అధ్యక్షుడు రాజశేఖర్ షెట్కార్, ప్రధాన కార్యదర్శి ఆర్.సుభాష్ పాల్గొన్నారు.


డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, బీదర్ ఎమ్మెల్యే శైలేంద్ర బెళదాళేను సన్మానిస్తున్న నిర్వాహకులు

అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా రంగనాయక సాగర్

- లింగారెడ్డిపల్లి రూట్‌లో రూ.60కోట్లతో ఫోర్‌లేన్ రోడ్డు
- ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేటకమాన్: రాబోయే రోజుల్లో రంగనాయక సాగర్ అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా రూపుదిద్దుకుంటుందని ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట మున్సిపాలిటీ పరిధి ఒకటో వార్డు లింగారెడ్డిపల్లిలో పద్మశాలి, ఎస్సీ కమ్యూనిటీ హాళ్లను ప్రారంభించి, కుమ్మరి, కమ్మరి, విశ్వబ్రాహ్మణ కమ్యూనిటీ హాళ్లు, సీసీ రోడ్ల నిర్మాణ పనులకు మంత్రి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సిద్దిపేటకు అన్ని దిక్కులా రూ.60కోట్లతో 4 వరుసల రోడ్డు ఇప్పటికే నిర్మించామని తెలిపారు. లింగారెడ్డిపల్లిలో రూ.2కోట్లతో పలు అభివృద్ధి పనులు ప్రారంభించుకోవడం జరిగిందన్నారు. నాలుగు వరసల రహదారికి 100 ఫీట్ల స్థలం అవసరం కానీ, గ్రామంలో ఇళ్లు దెబ్బతింటున్నాయని 80 ఫీట్ల రోడ్డు రేణుక ఎల్లమ్మ గుడి నుంచి మెట్టుబండల వరకు సెంట్రల్ లైటింగ్‌తో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇళ్లు దెబ్బతిన్న వారికి గృహలక్ష్మి ద్వారా ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. చింతల్ చెరువు కింద బ్రిడ్జి నిర్మించడం జరుగుతుందన్నారు. లింగారెడ్డిపల్లిలో ఇప్పటికే బస్తీ దవఖానా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అన్ని కులాలకు కమ్యూనిటీ హాల్స్ నిర్మించామని, రంగనాయక సాగర్‌లో పల్లగుట్టపై రూ.110 కోట్లతో డెస్టినేషన్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.


గృహలక్ష్మి పథకం మంజూరు పత్రాలను పంపిణీ చేస్తున్న మంత్రి హరీశ్ రావు

దసరాలోపు వెయ్యి పడకల ఆస్పత్రి

సిద్దిపేట ఏన్సాన్‌పల్లి శివారులో నిర్మిస్తున్న వెయ్యి పడకల ప్రభుత్వ ఆస్పత్రిని దసరా పండగ లోపు ప్రారంభించనున్నట్లు మంత్రి తెలిపారు. ఈ ఆసుపత్రిలో 150 మంది వైద్యుల ద్వారా క్యాన్సర్‌తో పాటు అన్ని రకాల వైద్య సేవలు ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు. కేసీఆర్ కిట్లు, రైతు బంధు, రైతు బీమా, పింఛన్లు వంటి ఎన్నో సంక్షేమ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందన్నారు.

ఆత్మనూన్యతతో ఉండొద్దు

సిద్దిపేటజోన్: మహిళలు సహనంతో అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, ఆత్మ నూన్యతతో ఉండొద్దని మంత్రి హరీశ్ రావు అన్నారు. ఆదివారం స్థానిక విపంచి ఆడిటోరియంలో తెలంగాణ రాష్ట్ర మహిళ సహకార అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా కుట్టు శిక్షణ, బ్యూటీషియన్ శిక్షణ పూర్తి చేసుకున్న కిశోర బాలికలకు రాష్ట్ర మహిళ సహకార అభివద్ధి సంస్థ చైర్మన్ ఆకుల లలిత తో కలిసి మంత్రి హరీశ్ రావు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు.

మట్టి గణపతితో పర్యావరణ పరిరక్షణ

- టీఎస్ టీపీసీ చైర్మన్ మఠం భిక్షపతి

సంగారెడ్డి టౌన్: గణేశ్ నవరాత్రుల్లో మట్టితో చేసిన వినాయక ప్రతిమలను పూజిస్తే పర్యావరణాన్ని పరిరక్షించిన వారమవుతామని తెలంగాణ స్టేట్ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ (టీఎస్ టీపీసీ) చైర్మన్ మఠం భిక్షపతి అన్నారు. వినాయక చవితిని పురస్కరించుకొని ఆదివారం సంగారెడ్డిలో ఉచితంగా మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మట్టి వినాయక ప్రతిమలపై ప్రజలకు అవగాహన కల్పిస్తోందన్నారు. రసాయనాలతో చేసిన విగ్రహాలను నిమజ్జనం చేస్తే నీటి కాలుష్యం ఏర్పడుతుందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని 12 ఏళ్లుగా మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్ విజేందర్ రెడ్డి, కాకతీయ నగర్ కాలనీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


మట్టి గణపతి ప్రతిమలను పంపిణీ చేస్తున్న టీఎస్ టీపీసీ చైర్మన్ మఠం భిక్షపతి

విద్యుత్ సమస్యలపై అధికారులను సంప్రదించాలి

సంగారెడ్డి మున్సిపాలిటీ: సంగారెడ్డికి సంబంధించి విద్యుత్ సమస్యలను సంగారెడ్డి అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ లక్ష్మణ్ ను (94408 13634) సంప్రదించాలని విద్యుత్ శాఖ ఎస్ఈ మాధవరెడ్డి ఆదివారం తెలిపారు. అలాగే సదాశివపేటకు సంబంధించి అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ వీరారెడ్డిని (94408 13651) సంప్రదించాలని పేర్కొన్నారు. సంగారెడ్డి డివిజన్‌కు సంబంధించి సంగారెడ్డి డివిజన్ పర్యవేక్షణ అధికారి డివిజనల్ ఇంజనీర్ సురేందర్ రెడ్డి (94408 13627)అందుబాటులో ఉంటారన్నారు. సంగారెడ్డి, సదాశివపేట పట్టణ ప్రజలు విద్యుత్ సమస్యలను వారి దృష్టికి తేవాలన్నారు.

21న జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల పంపిణీ

పటాన్‌చెరు టౌన్: ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తూ, ప్రజా సమస్యల పరిష్కారంలో కీలక పాత్ర పోషిస్తున్న జర్నలిస్టుల సంక్షేమానికి సీఎం కేసీఆర్ ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారురు. ఈనెల 21వ తేదీన పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలోని పటాన్‌చెరు, రామచంద్రపురం, అమీన్‌పూర్, జిన్నారం, గుమ్మడిదల మండలాల పరిధిలోని వంద మంది జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల పట్టాల పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రభాకర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ కుమార్ గౌడ్, సాయి చరణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రెస్టారెంట్ పై దాడి : కేసు నమోదు

సంగారెడ్డి మున్సిపాలిటీ: భోజనం చేసేందుకు రెస్టారెంట్ ముగ్గురు వ్యక్తులు వచ్చారు. అయితే భోజనంలో పురుగులు వచ్చాయంటూ రెస్టారెంట్‌ను ధ్వంసం చేశారు. ఈ సంఘటన చౌటకూర్ మండలం సుల్తాన్‌పూర్‌లో ఆదివారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. లక్కీ రెస్టారెంట్ యజమాని బస్వరాజ్ పాటిల్, రెస్టారెంట్‌కు వచ్చినవారు భోజనం విషయంలో ఘర్షణపడ్డారు. ఇద్దరు వ్యక్తులు రెస్టారెంట్ అద్దాలను పగులగొట్టి, ఫర్నిచర్‌ను ధ్వంసం చేశారు. దీంతో రెస్టారెంట్ యజమాని మల్లేశం పుల్కల్ పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కరుణాకర్ మరో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు.


హోటల్‌పై దాడి చేస్తున్న దృశ్యం

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి?

- కుటుంబ సభ్యుల ఫిర్యాదు
- పూడ్చిన శవాన్ని బయటకు తీసి పోస్టుమార్టం

దుబ్బాకరూరల్: అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి చెందిన సంఘటన మండలంలోని హబ్సిపూర్ గ్రామంలో జరిగింది. సీఐ కృష్ణ తెలిపిన వివరాలు. బైండ్ల బాలవ్వ(50) వ్యవసాయ కూలీ పనులు చేస్తుంటుంది. భర్త ఆరేళ్ల క్రితం చనిపోయాడు. ఆమెకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. కూతుళ్లకు వివాహం కాగా, కుమారులు హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తుంటారు. ఈనెల 7న బాలవ్వ మృతి చెందగా ఇంటి ఎదుటఉన్నవారు కుమారులకు సమాచారం అందించారు. మంచం మీద నుంచి కింద పడి మృతి చెంది ఉండవచ్చని భావించిన కుటుంబ సభ్యులు, బంధువులు అదే రోజు అంత్యక్రియలు నిర్వహించారు. అప్పటికే బాలవ్వ ముక్కు నుంచి రక్తం కారుతుంది. శవాన్ని దించుతుండగా మృతురాలి తల కిందఉన్న దిండు జారి కిందపడింది. దానిపై రక్తం మరకలు కనిపించాయి. అంత్యక్రియలు పూర్తి చేసి ఇంటికి వచ్చి చూసే సరికి ఇంటిలో కూడా రక్తం మరకలు ఉన్నాయి. అనుమానం వచ్చి మృతురాలి కుమారులు నాగరాజు, పరుశరాములు ఈనెల 16న పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. సీఐ కృష్ణ, ఎస్ఐ గంగరాజు ఆధ్వర్యంలో పూర్తి స్థాయిలో దర్యాప్తు చేపట్టారు. ఆదివారం పూడ్చిన శవాన్ని బయటకు తీసి అక్కడే తహసీల్దార్ జయంత్, ఫోరెనిక్స్ బృందం సభ్యుల ఆధ్వర్యంలో పోస్టుమార్టం నిర్వహించారు. అనుమానిత నిందితుడు పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం.


పోస్ట్‌మార్టం నిర్వహిస్తున్న అధికారులు


మృతురాలు బాలవ్వ (ఫైల్)